క్లుప్తంగా

రాజశేఖర్‌రెడ్డి వైఖరి మార్చుకోవాలి

బీజేవైఎం జిల్లా కార్యాలయం కార్యదర్శి వెంకట్

అనంతగిరి: బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి తన వైఖరిని మార్చుకుని అందరిని సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని బీజేవైఎం జిల్లా కార్యాలయం కార్యదర్శి వెంకట్ ఒక ప్రకటనలో తెలిపారు. మూడు రోజుల క్రితం బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు చరణ్‌రెడ్డిని ఆయన స్వగ్రామం ధన్నారంలో నిర్వహించిన కార్యక్రమంలో తన అనుచరులతో కలిసి అతనిపై దుర్భాషలాడుతూ, చేయి చేసుకోవడానికి యత్నించడాన్ని ఖండిస్తున్నామని పేర్కొన్నారు. ఈ విషయంలో రాష్ట్ర నాయకత్వం వెంటనే స్పందించి అతనిపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

స్నేహితురాలికి ఆర్థిక సాయం



రాములమ్మకు ఆర్థిక సాయం అందజేస్తున్న స్నేహితులు

యాలాల: భర్త అకాల మరణంతో బాధలో ఉన్న కుటుంబానికి చిన్ననాటి స్నేహితులు సాయం చేసి అండగా నిలిచారు. మండలంలోని పగిడియాల ఉన్నత పాఠశాలకు 2004–05బ్యాచ్‌కు చెందిన రాములమ్మ భర్త ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పదో తరగతి స్నేహితులు ఆమెకు అండగా నిలవాలనుకున్నారు. అందరూ తమ వంతుగా సేకరించిన డబ్బులను ఆమె స్వగ్రామం కమాల్‌పూర్‌కు వెళ్లి అందజేశారు. పేద కుటుంబానికి చెందిన రాములమ్మకు స్నేహితులు సాయం చేసి అండగా నిలవడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఉద్యోగ నోటిఫికేషన్లు వెంటనే విడుదల చేయాలి



మాట్లాడుతున్న నాయకులు

అనంతగిరి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే జాబ్ కాలెండర్‌ను ప్రకటించి ఉద్యోగాలను భర్తీ చేయాలని డీవైఎఫ్‌ఐ జిల్లా నాయకుడు సత్యనారాయణ పేర్కొన్నారు. ఆదివారం వికారాబాద్‌లోని సైటీయూ కార్యాలయంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రం ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఇప్పటికీ వేలల్లో ఉద్యోగ నోటిఫికేషన్ కూడా వేయలేదని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం కొత్త నోటిఫికేషన్లను సత్వరమే విడుదల చేసి ఉద్యోగాల భర్తీకి పూనుకోవాలన్నారు. జిల్లాలోని విద్యా సంస్థల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. యువ వికాసం వెంటనే అందించి నిరుద్యోగుల జీవితాల్లో బాటలు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకట్, రాంరెడ్డి, వెంకటయ్య, యాదయ్య, లాలయ్య, కిషన్, శంకర్, శేఖర్ పాల్గొన్నారు.

గోశాలకు దాణా అందజేత

షాద్‌నగర్‌రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని చౌడమ్మగుట్ట ఆంజనేయస్వామి దేవాలయ ఆవరణలోని శ్రీకృష్ణ గోశాలకు ఆదివారం శివ శక్తి ప్లైవుడ్ అండ్ హార్డ్‌వేర్ యజమాని పవన్‌కుమావత్ రూ.80వేల విలువ చేసే ఒక లారీ లోడు కుట్టి(దాణా)ని అందజేశారు. ఈ సందర్భంగా మాజీ వార్డు సభ్యుడు సింగపాగ లక్ష్మయ్య మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సేవా దృక్పధాన్ని అలవర్చుకోవాలని సూచించారు. గోవుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం దాణ అందజేసిన దాత పవన్‌కుమావత్‌కు నిర్వాహకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

రాజ్యాధికారంతోనే సమస్యలు పరిష్కారం

షాద్‌నగర్‌రూరల్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, రాజ్యాధికారంతోనే సమస్యలు పరిష్కారమవుతాయని బీసీసేన నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు బాస వరలక్ష్మి అన్నారు. ఆదివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని రాసుమల్లగూడ, నాగులపల్లి గ్రామాల్లో బీసీసేన మండల మహిళా అధ్యక్షురాలు జక్కుల జలజ ఆధ్వర్యంలో మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలందరూ ఐకమత్యంతో ఏకతాటిపైకి రావాలని సూచించారు. విద్య, ఉద్యోగ, ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో అభివృద్ధి చెందాలన్నారు. అనంతరం ఆయా గ్రామాల బీసీసేన మహిళా కమిటీలను ఎన్నుకున్నారు. రాసుమల్లగూడ నూతన కమిటీ అధ్యక్షురాలిగా నత్తి శివలీల, ఉపాధ్యక్షురాలిగా రమాదేవి, ప్రధాన కార్యదర్శిగా శ్యామలమ్మ, కార్యదర్శిగా నర్సమ్మ, సహాయ కార్యదర్శిగా నిర్మల, కోశాధికారిగా పద్మమ్మ, సభ్యులుగా వనజ, కిష్టమ్మ, నాగులపల్లి కమిటీ అధ్యక్షురాలిగా విజయలక్ష్మి, ఉపాధ్యక్షురాలిగా లావణ్య, ప్రధాన కార్యదర్శిగా పోలెపల్లి భాగ్యమ్మ, కార్యదర్శిగా చాకలి అంజమ్మ, సహాయ కార్యదర్శిగా సంతోష, కోశాధికారిగా వడ్లలక్ష్మిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

గెట్ల పంచాయితీ!



తహసీల్దారు కార్యాలయం, దౌల్తాబాద్

- భూముల ధరలు పెరగడమే కారణం
- పెండింగ్‌లో కొలతలు
- శాశ్వత సర్వేయర్లు లేక సమస్య
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు
- పట్టించుకోని అధికారులు

దౌల్తాబాద్: మండల కేంద్రానికి చెందిన ఓ రైతు ఆరు నెలల క్రితం భూమి కొలత కోసం మీ సేవలో దరఖాస్తు చేసుకున్నాడు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 45 రోజుల్లోపు సర్వేయర్ భూమి కొలతలు చేపట్టాలి. కాని ఇప్పటి వరకు అతని భూమి సర్వే చేయలేదు. ఇటీవల వారం రోజుల క్రితం గెట్టు పంచాయితీతో ఇరు వర్గాల భూ యజమానులు దాడులు చేసుకున్నారు. సమస్య పరిష్కారం కోసం పోలీస్ స్టేషన్ వరకు వెళ్లడంతో ఇరువురిపై కేసులు నమోదయ్యాయి. ఇలా మండలంలోని చాలా గ్రామాల్లో సంబంధిత అధికారులు సకాలంలో సర్వే చేసినట్లయితే పంచాయితీలు జరగవని పలువురు వాపోతున్నారు. ఈ విషయం గురించి సంబంధిత కార్యాలయాల్లో ప్రశ్నిస్తే సరైన సిబ్బంది లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని అక్కడ అధికారులు చెబుతున్నట్లు తెలిసింది. భూ కొలతలకు శాశ్వత సర్వేయర్లు లేక రైతుల ఇబ్బందులను పట్టించుకునే వారు కరువయ్యారు. నాలుగేళ్లుగా ఇన్‌చార్జి సర్వేయర్లే కొనసాగుతుండడంతో కొలతలు పెండింగ్‌లో ఉంటున్నాయి. మండలంలో 33 పంచాయతీలు ఉండగా వీటి పరిధిలో 46వేల ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. 21,500 మంది రైతులు వ్యవసాయ పనుల్లో ఉన్నట్లు అధికారుల లెక్కలు. వ్యవసాయ ఆధారిత మండలం కావడంతో ఇక్కడ భూముల రేట్లకు డిమాండ్ ఉంది. ఇక్కడ ఎకరం భూమి రూ.50లక్షల నుంచి రూ.80లక్షల వరకు పలుకుతుంది.

ఇన్‌చార్జి సర్వేయర్లతో ఇబ్బందులు

ఈ మండలానికి ఉన్న సర్వేయర్ కొడంగల్, దౌల్తాబాద్ మండలాలకు విధులు నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా ఆయనకు అదనపు బాధ్యతలు కూడా అప్పగిస్తున్నారు. ఇలా ఇన్‌ఛార్జి సర్వేయర్లు తమ విధుల్లో నిమగ్నమై భూ కొలతల సర్వే చేయడంలో జాప్యం జరుగుతుంది. ఈ క్రమంలో రైతుల గెట్ల పంచాయితీ ఎక్కువవుతున్నాయి. తన గెట్టులో వచ్చావని చెబితే, మరో రైతు నువ్వే కలుపుకున్నట్లు వాదిస్తూ ఒకరినొకరు ఘర్షణకు దిగి సమస్యను తెచ్చుకుంటున్నారు. ఈ క్రమంలో అక్కడ ఉన్న వాస్తవ గెట్లు తెగుతున్నాయి. పంచాయితీలు పెరుగుతున్నాయి. కొంతమంది రైతులు ప్రైవేట్ సర్వేయర్లతో రూ. వేలల్లో ఖర్చు చేసుకుని కొలతలు చేయించుకుంటున్నారు. ఒక్కో రైతు మీసేవలో పదులసార్లు దరఖాస్తు చేసుకున్నా భూమి కొలిచే నాథుడు కరువయ్యారు. కొద్దిపాటి భూమి కోసం రక్త సంబంధికుల మధ్య, స్నేహితుల మధ్య ఘర్షణలు ఎక్కువవుతున్నాయి.

న్యాయం చేయాలని ఫిర్యాదు

భూమి కొలతకు మీ సేవలో రైతులు దరఖాస్తు చేసుకున్నా సర్వేయర్ లేకపోవడంతో రైతుల మధ్య గొడవలు పెరిగి పోలీస్‌స్టేషన్ వరకు చేరుతున్నాయి. దీంతో భూముల పంచాయితీ పోలీసులకు తలనొప్పిగా మారింది. ఒక్కో సర్వేయర్‌కు రెండు నుంచి మూడు మండలాల బాధ్యతలు ఉండడంతో పాటు ఇతర కొలతలు అప్పగిస్తుండడంతో వారికి పనిభారం పెరిగింది. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి ఈ మండలానికి శాశ్వత సర్వేయర్‌ను నియమించాలని రైతులు కోరుతున్నారు.

వారాంతపు సంత.. తప్పని చింత

- రోడ్డుపైనే నిర్వహణ
- ఇబ్బందులు పడుతున్న వ్యాపారులు, వినియోగదారులు
- క్రయవిక్రయానికి స్థలం కేటాయించాలని వేడుకోలు



బాలంపేటలో నిర్వహిస్తున్న సంత

దౌల్తాబాద్: వారాంతపు సంతలతో వినియోగదారులకు, రైతులకు ఉపయోగపడుతున్నా చింత మాత్రం తీరడం లేదు. మండలంలోని దౌల్తాబాద్, బాలంపేట, గోకఫసల్‌వాద్ గ్రామాల్లో ప్రతీవారం సంత నిర్వహణకు స్థలం లేక చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపైనే కూరగాయలు విక్రయిస్తుండడంతో అటు వ్యాపారులు, వినియోగదారులు, వాహనదారులకు సమస్య తప్పడం లేదు. మండల కేంద్రంలో నిర్వహిస్తున్న దౌల్తాబాద్ వారాంతపు సంతకు యాంకి, గుముడాల, అల్లాపూర్, కౌడీడ్, నర్సాపూర్ గ్రామాలకు చెందిన వ్యాపారులు వస్తుంటారు. అంతారం, సుల్తాన్‌పూర్, నాగసార్, గత్పనుంచి బాలంపేటకు వస్తారు. గోకఫసల్‌వాద్ సంతకు ఎల్‌జీతండా, పోల్కంపల్లి, తిమ్మారెడ్డిపల్లి, ర్యాలగుట్ట తండా నుంచి రైతులు వారు పండించిన కూరగాయాలను తీసుకువచ్చి విక్రయిస్తుంటారు. ఇక్కడ కూరగాయలు కొనుగోలు చేయడానికి వినియోగదారులు భారీగా విచ్చేస్తారు. వారికి కావలసినవి కొనుగోలు చేసుకుంటారు. సంత నిర్వహించేందుకు ప్రత్యేకంగా స్థలం లేకపోవడంతో ప్రధాన రోడ్లపైనే విక్రయాలు చేస్తున్నారు. దీంతో గ్రామంలోకి వెళ్లే రోడ్డు రైతులు, చిరువ్యాపారులు, కొనుగోలుదారులు, స్థానికులతో కిటకిటలాడుతుంది. ద్విచక్రవాహనాలు, ఆటోలు, భారీవాహనాలు వెళ్లలేని పరిస్థితి నెల కొంటుంది. ఈ విషయంలో వినియోగదారులు, సాధారణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రహించి మండలంలోని బాలంపేట, దౌల్తాబాద్ వారాంతపు సంత నిర్వహించేందుకు స్థలం కేటాయించాలని స్థానికులు కోరుతున్నారు.

ఎమ్మార్పీఎస్ బలోపేతమే లక్ష్యం



దేవనూరు గ్రామ కమిటీ సభ్యులతో సూర్యప్రకాశ్

మండల ఇన్‌చార్జి సూర్యప్రకాశ్

యాలాల: గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ బలోపేతమే లక్ష్యమని మండల ఇన్‌చార్జి సూర్యప్రకాశ్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని దేవనూరు, రాఘవపూర్ గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వచ్చే నెల 7న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ప్రతి గ్రామంలో జెండా ఎగురవేసేలా ప్రణాళిక చేస్తున్నట్లు తెలిపారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీ మందక్రిష్ణ మాదిగ నాయకత్వంలో 30 ఏళ్లుగా ఎన్నో పోరాటాలు చేశారన్నారు. దేవనూరు గ్రామ కమిటీ అధ్యక్షుడిగా మెట్లి శ్రావణ్, అధికార ప్రతినిధిగా నరేశ్, ఉపాధ్యక్షుడిగా నరేందర్, రాఘవపూర్ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా రాంచందర్, అధికార ప్రతినిధిగా శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా చంద్రకాంత్, బాలరాజ్ తదితరులను నియమించినట్లు ఆయన పేర్కొన్నారు.

పేదల సంక్షేమమే బీజేపీ లక్ష్యం



వికసిత్ భారత్ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు తదితరులు

పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి

పరిగి: పేదల సంక్షేమమే బీజేపీ లక్ష్యమని జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చి 11ఏళ్లలో దేశంలోని ప్రతి పేదవాడికి సంక్షేమ ఫలాలు అందజేశారన్నారు. ఆదివారం పట్టణ కేంద్రంలో వికసిత్ భారత్ 11 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం ప్రజలకు అందిస్తున్న సంక్షేమాలు, అందించిన పథకాల గురించి ప్రతీ బూత్‌లో రచ్చబండ ద్వారా ప్రజలకు వివరించాలన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం అంత్యోదయ సిద్ధాంతాన్ని పాటిస్తూ ప్రతీ ఒక్కరి మన్ననలు పొందుతున్నారన్నారు. భారతదేశాన్ని ప్రపంచ పటంలో అభివృద్ధి చెందిన దేశాల సరసన నిలిపారన్నారు. ఎన్నో దేశాలు భారత్ సాయాన్ని కోరుతున్నాయని గుర్తు చేశారు. ప్రపంచ దేశాల సమావేశాల్లో భారత్‌కు ప్రత్యేక స్థానం సంతరించుకుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సినీయర్ నాయకులు కేఎస్‌ఆర్ ట్రస్ట్ చైర్మన్ శరత్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్ సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న సురేశ్ ముదిరాజ్

- త్వరలో బహిరంగ సభ
- బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు సురేశ్

దుద్యాల్: కొడంగల్‌లో ముదిరాజ్ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు దుద్యాల్ బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు బొగమోని సురేశ్ తెలిపారు. హైదరాబాద్ బీసీ భవన్‌లో ఆదివారం ముదిరాజ్‌ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముదిరాజ్‌లు సమష్టిగా ఉండి హక్కులను సాధించుకోవాలన్నారు. రాష్ట్ర స్థాయి ముదిరాజ్ నాయకుల నిర్ణయం మేరకు త్వరలో లక్ష మందితో బహిరంగా సభ నిర్వహించాలని తీర్మాణం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు జగన్ మోహన్, జనరల్ సెక్రటరీ వెంకటయ్య, నాయకులు కోట్ల పుష్పలత, భీమ్‌సేన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మోమిన్‌పేట: మండల పరిధిలోని మేకవనంపల్లి ఫీడర్ పరిధిలో అంరాధికుర్దు, అంరాధికలాన్, చిన్న కోల్కుంద, కోల్కుంద, రావులపల్లి గ్రామాల్లో సోమవారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ వెంకటేశ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను నరికేందుకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కావున ఈ విషయాన్ని వినియోగదారులు గ్రహించి తమకు సహకరించాలని ఆయన కోరారు.

కొడంగల్‌లో..

కొడంగల్: మండల పరిధిలోని రావులపల్లి, టేకుల్ కోడ్ సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని అధికారులు తెలిపారు. 33 కేవీ లైన్ మరమ్మతులు, సబ్ స్టేషన్ల పరిధిలో ఆయా పనులవల్ల మండల పరిధిలోని రావులపల్లి, ఇందనూర్, కస్తూరుపల్లి, అంగడిరాయిచూర్, టేకుల్‌కోడ్, అన్నారం, రుద్రారం, పాటిమీదిపల్లి, నాగారం దౌల్తాబాద్ మండలంలోని మాటూర్, చంద్రకల్, కుప్పగిరి గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపేయనున్నట్లు వారు పేర్కొన్నారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తారని తెలిపారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గ్రహించి తమకు సహకరించాలని కోరారు.

ధారూరులో..

ధారూరు: మండల పరిధిలోని మున్నూరుసోమారం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మండల ట్రాన్స్‌కో ఏఈ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. విద్యుత్ మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. ఈ విషయాన్ని వినియోగదారులు గ్రహించి తమకు సహకరించాలని కోరారు.

భక్తులందరూ ఐక్యతతో ముందుకుసాగాలి

అయ్యప్ప పాదయాత్ర కమిటీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి, భక్తులు

మొయినాబాద్‌రూరల్: అయ్యప్పమాల ధరించే భక్తులందరూ కులమతాలకతీతంగా పాదయాత్ర చేపడతారని రాష్ట్ర ఉపసర్పంచ్‌ల ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు, అయ్యప్ప పాదయాత్ర కమిటీ సభ్యుడు అల్లం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం హిమాయత్‌నగర్ సమీపంలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో రాష్ట్రంలోని ఆయా జిల్లాలకు చెందిన అయ్యప్ప పాదయాత్ర భక్తులు పెద్దఎత్తున సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాదయాత్రలో పాల్గొనే సభ్యులందరూ సభ్యత్వ నమోదు తీసుకోవాలని సూచించారు. భక్తులందరూ ఐకమత్యంతో ముందుకు సాగాలన్నారు. శబరిమలకు వెళ్లు సమయంలో పాదయాత్ర సంఘం ఆధ్వర్యంలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసుకుందామన్నారు. అదే విధంగా పాదయాత్రలో వెళ్తున్న సభ్యులు ప్రమాద బీమా చేసుకున్న వారే అని, వారికి ఎలాంటి ప్రమాదం జరిగిన బీమా అమలు చేసేందుకు కృషి చేయాలని కోరారు. సమావేశంలో అల్లం శ్రీనివాస్ రెడ్డి, పవన్‌నాయుడు, రాజశేఖర్‌రెడ్డి, వెంకటేశ్‌యాదవ్, బుచ్చిబాబు, రమేశ్, రతన్ పాల్గొన్నారు.

మంత్రి వర్గంలో టీఆర్ఆర్‌కు చోటు కల్పించాలి

యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి

దోమ: పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డికి మంత్రి వర్గంలో చోటు కల్పించాలని దోమ యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. పార్టీ అధికారంలో లేనిసమయంలో పార్టీ ఉన్నతికి జిల్లా వ్యాప్తంగా ప్రచారం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పార్టీ అభ్యున్నతికి నిర్విరామంగా కృషి చేశారని గుర్తు చేశారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలని, పార్టీ కోసం పనిచేసే వ్యక్తులను గుర్తించాలన్నారు. ఈ విషయంలో కేంద్ర నాయకత్వం చొరవ తీసుకోవాలన్నారు.

లోటస్ టెంపుల్‌లో భక్తుల సందడి



లోటల్ టెంపుల్‌లో స్వామివారి దర్శనానికి తరలివచ్చిన భక్తులు

మొయినాబాద్‌రూరల్: హిమాయత్‌నగర్ సమీపంలోని స్వామి నారాయణ గురుకుల్ లోటస్ టెంపుల్‌లో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. సెలవు దినం కావడంతో భక్తులు భారీగా తరలివచ్చి శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అర్చకులు శివలింగానికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి దర్శనంతో పాటు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న విష్ణువర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం పార్టీ అసెంబ్లీ కన్వీనర్ టంగుటూరి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పట్టణంలో పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. రోజు రోజుకు కాలుష్యం విపరీతంగా పెరిగిపోతోందని, అరికట్టి పర్యావరణాన్ని కాపాడాల్సిన అవసరం అందరిపై ఉందన్నారు. ఈ నేపథ్యంలో భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్‌ను పురస్కరించుకొని అమ్మకు వందనం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ప్రతీ బూత్‌లో వంద మొక్కలు నాటే కార్యక్రమాన్ని పార్టీ ఆధ్వర్యంలో చేపడుతున్నట్లు స్పష్టం చేశారు. మొక్కలు నాటే కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. కమ్మదనంలో నిర్వహించే మొక్కలు నాటే కార్యక్రమానికి మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ విచ్చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు ఇస్నాతి శ్రీనివాస్, చేగు సుధాకర్, శ్యాంసుందర్‌రెడ్డి పాల్గొన్నారు.

జానపద కళలకు జీవం

- జాతీయ స్థాయి ఫోక్ ఫేర్‌లో తెలంగాణ కళ
- ప్రదర్శన ఇచ్చిన కళాకారులు



ప్రదర్శన అనంతరం తెలంగాణ కళాకారులు

బొంరాస్‌పేట: కులం, మతం, వర్గంతో పనిలేదు. జానపద కళలకు కళాకారులు తమ ప్రదర్శనతో జీవం పోస్తున్నారు. ఈ నెల 16 నుంచి వారం రోజులపాటు ఒరిస్సాలోని పూరీలో గోల్డెన్‌బీచ్ ప్రోగ్రామ్ పేరుతో జాతీయ స్థాయిలో ప్రదర్శనలు నిర్వహించారు. సౌత్‌జోన్ కల్చర్ సెంటర్, తంజావూరు మినిస్ట్రీ ఆఫ్ కల్చర్ భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో ఆదివాసి, జానపద పాటలు, నృత్య ప్రదర్శనల ఫోక్ ఫేర్–2025 నిర్వహించారు. ఈ ప్రదర్శనలో తెలంగాణ కళ బంజారా నృత్యాన్ని వికారాబాద్, షాద్‌నగర్ కళాకారులు ప్రదర్శించారని సంఘం ప్రధాన కార్యదర్శి కృష్ణయ్య పేర్కొన్నారు. ఈ ప్రదర్శన చూపరులను ఆకట్టుకొని అక్కడి డీఎస్పీ శుద్ధ ప్రసన్నచే ప్రశంసలు అందుకున్నామని తెలిపారు. టీపీ రంగయ్య కళాబృందం, కొరియోగ్రాఫర్ శివ మాస్టర్, జానపద కళాకారులు పెంటప్ప, అనిల్, చిట్టి, స్రవంతి, రాజేశ్వరి, గీతాంజలి పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం.. అస్తవ్యస్తం



భరధ్వాజ్ కాలనీలో ఇళ్ల ఎదుట పారుతున్న మురుగునీరు



స్టార్ కాలనీలో రోడ్డు పక్క నుంచి కాల్వలా పారుతున్న మురుగునీరు

- రోడ్లపైనే పారుతున్న మురుగునీరు
- దుర్వాసనతో ఇబ్బంది పడుతున్న స్థానికులు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు

మొయినాబాద్: మున్సిపాలిటీలో మురుగునీటి పారుదల అస్తవ్యస్తంగా మారింది. సరైన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరు రోడ్లపైనే పారుతోంది. మున్సిపల్‌లోని భరద్వాజ్ కాలనీ, సహారా కాలనీ, స్టార్ కాలనీ, విజయనగర్ కాలనీల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు ఏర్పాటు చేయలేదు. ఆయా కాలనీల లేఅవుట్ చేసినప్పుడే వెంచర్ చేసినవారు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, రోడ్లు వేయాల్సి ఉన్నా అప్పట్లో అవేవి పట్టించుకోలేదు. లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకున్న తర్వాత ఇబ్బందులు మొదలయ్యాయి. ఆయా కాలనీల్లో గత ఐదేళ్లలో కొత్తగా ఇళ్ల నిర్మాణాలు అధికంగా జరిగాయి. ఆ ఇళ్ల నుంచి వచ్చే మురుగు నీరంతా రోడ్ల పైన, పక్క నుంచి కాలువలుగా పారుతుండడంతో దుర్వాసన, ఈగలు, దోమలతో రోగాలు వస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా మున్సిపాలిటీ పరిధిలోని హిమాయత్‌నగర్, ఎన్కేపల్లి, అజీజ్‌నగర్, చిలుకూరు, పెద్దమంగళారం గ్రామాల్లో సైతం పారిశుద్ధ్యం అస్థవ్యస్తంగా మారింది. మున్సిపల్ పరిధిలో పరిస్థితి దారుణంగా ఉన్నా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించాలని కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ధారూరు: మండల పరిధిలోని తరిగోపుల గ్రామంలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 2000–2001 పదోతరగతి విద్యార్థులంతా కలిసి అప్పటి ఉపాధ్యాయులు మతం చంద్రశేఖర్, మల్లయ్య, శివకుమార్, కిష్టయ్యలకు శాలువా కప్పి, పూలమాలలు వేసి జ్ఞాపిక అందజేసి ఘనంగా సన్మానించారు. కుటుంబ క్షేమ సమాచారాన్ని ఒకరినొకరు తెలుసుకున్నారు. అప్పటి జ్ఞాపకాలను, పాఠశాలలో చేసిన అల్లరి పనులను గుర్తు చేసుకున్నారు. అనంతరం వన భోజనాలు చేశారు.



విద్యార్థులతో ఉపాధ్యాయులు